సాక్షి
జగిత్యాల
సోమవారం, 17, జూలై, 2023



ఘనంగా పెద్దమ్మ బోనాలు

పెగడపల్లి : ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో పెద్దమ్మతల్లి బోనాల వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.



ఆలయంలో పూజలు

జగిత్యాలరూరల్: పొలాస సహస్ర వేయి లింగాల ఆలయంలో ఆదివారం మహిళా భక్తులు ప్రత్యేకపూజలు చేశారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
28.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బదిలీలు సాధారణం



వామనమూర్తిని సన్మానిస్తున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని ఎస్పీ భాస్కర్ అన్నారు. బదిలీపై వెళ్తున్న రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వామనమూర్తి వీడ్కోలు సమావేశం ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగింది. ఈసందర్భంగా వామనమూర్తిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఎక్కడ విధులు నిర్వహించినా అంకితభావంతో, వృత్తి ధర్మం పాటించాలన్నారు. పోలీస్‌శాఖకు మంచిపేరు తీసుకు రావాలని సూచించారు. కాలానుగుణంగా అనేకమార్పులు వస్తున్నాయని, సమయాన్ని, సందర్భాన్ని బట్టి విధులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వంజరి సంఘం వేడుకలు



బోనాల ఊరేగింపులో ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాలటౌన్: మున్సిపల్ నాలుగోవార్డు చెరువుకట్ట వద్ద ఆదివారం వరాల పోచమ్మ బోనాల పండుగ వైభవంగా జరుపుకున్నారు. వంజరి సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ అచ్చుబండ పోచమ్మ బోనాల వేడుకలకు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ హాజరై మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు దావ సురేశ్, వంజరి సంఘం ప్రతినిధులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీదే విజయం



మాట్లాడుతున్న ఎస్.కుమార్

ధర్మపురి: రానున్న ఎన్నికల్లో బీజేపీదే విజయమని బీజేపీ దళిత మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక ఎస్ఆర్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ధర్మపురి అసెంబ్లీస్థాయి టిఫిన్ బైఠక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఎస్.కుమార్ మాట్లాడారు. ఇద్దరు ఎంపీలతో మొదలైన బీజేపీ ప్రస్థానం.. నేడు 303కు చేరిందని, కేంద్రంలో బలమైన రాజకీయ శక్తిగా పాలన కొనసాగిస్తోందన్నారు. బీజేపీ కార్యకర్తల్లో అయోమయం సృష్టించడానికే బీఆర్ఎస్ నాయకులు ఇతర పార్టీల్లోకి వెళ్తున్నారని అసత్యపు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రతీకార్యకర్త కష్టపడి పనిచేస్తే బీజేపీ గెలుపు ఖాయమని ఆయన అన్నారు. కస్తూరి సత్యం, గాజుల మల్లేశం, పిల్లి శ్రీనివాస్, ఓరుగంటి చంద్రశేఖర్, బెజ్జారపు లవన్‌కుమార్, సంగెపు గంగారాం తదితరులు పాల్గొన్నారు.



వంతెన వద్ద కోతకు గురైన పెద్దవాగు



చిన్నపాటి వానకే పొంగిన పెద్దవాగు



వాగు తీరంలోని ఆలయాల సముదాయం

ఆలయాలకు వరద ముప్పు

- వంతెన నిర్మాణంలో జాప్యమే కారణం
- రెండెకరాల మేర కోతకు గురైన పెద్దవాగుతీరం
- ఈసారి భారీవర్షాలు కురిస్తే ప్రమాదమే
- సంగెం – యెఖీన్‌పూర్ పెద్దవాగు వద్ద దుస్థితి ఇది

కోరుట్లరూరల్: గలగల పారే సెలయేరు.. దాని తీరంలో సుమారు ఇరవై ఎకరాల సువిశాలమైన స్థలం.. అందులో ఏడు ఆలయాల సముదాయం.. చుట్టూ పచ్చని చెట్లతో కూడిన ఆహ్లాద వాతావరణం.. పక్షుల కిలకిల రావాలు.. వెరసి ఆధ్యాత్మికత పంచే ప్రకృతి.. ఇలాంటి అందమైన ప్రాంతానికి వానాకాలం కోత ముప్పు ముంచుకు వస్తోంది. సంగెం – యెఖీన్‌పూర్ మధ్య పెద్దవాగుపై చేపట్టిన వంతెన, చెక్‌డ్యామ్ నిర్మాణంలో జాప్యమే ఇందుకు కారణమనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

వంతెన, చెక్‌డ్యాం పనులకు రూ.4.10 కోట్లు..

- యెఖీన్‌పూర్–సంగెం గ్రామాల మధ్య పెద్దవాగుపై వంతెన, చెక్‌డ్యాం నిర్మాణానికి 2016లో రాష్ట్ర ప్రభుత్వం రూ.4.10 కోట్లు మంజూరు చేసింది.
- అప్పట్నుంచి పనులు నత్తనడకన కొనసాగుతూనే ఉన్నాయి.
- ఇప్పటివరకు సుమారు రూ.3.30 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి.
- మరో రూ.90 లక్షల విలువైన పనులు మిగిలి ఉన్నాయి.
- ఈ నిధులు వెచ్చించి వంతెనకు రెండు వైపులా రెయిలింగ్, బ్యాక్ ఫిల్లింగ్, రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉంది.
- ఈ పనుల పూర్తికి మిగులు నిధులు సరిపోవని అధికారులు అంటున్నారు.
- గత వర్షాకాలంలో పెద్దవాగు ఉప్పొంగి సంగెం గ్రామం వైపు సుమారు రెండెకరాల మేర తీరం కోతకు గురైంది. వరద ఉధృతికి వంతెన గోడ ఒకవైపు వంగి ప్రమాదకరంగా మారింది.
- దీని పునర్నిర్మాణం కోసం మరో రూ.కోటికి పైగా అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు తెలిసింది.

ఆధ్యాత్మికతకు ఆలవాలం..

పెద్దవాగు తీరంలోని సుమారు ఇరవై ఎకరాల విస్తీర్ణంలో ఏడు ఆలయాలు నిర్మించారు. ఇందులో అతిపురాతన శ్రీసంగమేశ్వర ఆలయంతోపాటు ఎల్లమ్మ, శ్రీమల్లికార్జునస్వామి, దుర్గమ్మ, శ్రీసరస్వతీ, శ్రీహనుమాన్, బద్దిపోచమ్మ ఆలయాలు ఉన్నాయి. వాగు తీరానికి కేవలం 20 మీటర్ల దూరంలోనే ఇవి ఉన్నాయి. ఈసారి వానలు కురిసి వరద ఉధృతి పెరిగితే ఆలయాలకు ముప్పు పొంచిఉందని వివిధ గ్రామాల ప్రజలు, భక్తులు ఆందోళన చెందుతున్నారు. వీటితోపాటు గ్రామస్తులు ఇటీవల సుమారు రూ.40 లక్షలు వెచ్చించి నిర్మించిన ఫంక్షన్‌హాల్, డైనింగ్‌హాల్‌లకూ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు జిల్లాలకు రవాణా సౌకర్యం..

జిల్లాలోని కోరుట్ల, కథలాపూర్ మండలాలతోపాటు సమీప రాజన్న సిరిసిల్ల జిల్లాలను కలుపుతూ పెద్దవాగుపై వంతెన నిర్మాణం చేపట్టారు. ఇది అందుబాటులోకి వస్తే సుమారు పది గ్రామాలు, రెండు జిల్లాలకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుంది. అంతేకాదు.. ఇక్కడే చిన్నవాగు, పెద్దవాగు సంగమం ఉంటుంది. పర్యాటక ప్రాంతంగా ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతోంది.

చర్యలు చేపట్టాలి



పెద్దవాగు ఉప్పొంగితే తీరం మళ్లీ కోతకు గురయ్యే ప్రమాదం ఉంది. అధికారులు తక్షణమే వాగును పరిశీలించాలి. తీరం కోతకు గురికాకుండా తాత్కాలిక చర్యలైనా తీసుకోవాలి.

– జక్కని గణేశ్, మాజీ సర్పంచ్, సంగెం

పరిష్కారం చూపాలి



పెద్దవాగుపై వంతెన, చెక్‌డ్యాం నిర్మాణంలో జాప్యంతో ఆలయాలకు ప్రమాదం పొంచి ఉంది. పెద్దవాగు వరదతో వాగు తీరం కోతకు గురికాకుండా శాశ్వత పరిష్కార మార్గం చూపాలి.

– చెప్యాల నర్సయ్య, సర్పంచ్, సంగెం

ఉన్నతాధికారులకు నివేదిక



పెద్దవాగు వద్ద ప్రస్తుత పరిస్థితి గురించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వంతెన, చెక్‌డ్యామ్ నిర్మాణం పూర్తిచేయిస్తాం. పెద్ద వాగుతీరం కోతకు గురికాకుండా చర్యలు తీసుకుంటాం.

– ఆదిత్య, ఏఈ, పంచాయతీరాజ్

ఎమ్మెల్సీ రమణకు కేటీఆర్ పరామర్శ



ఎల్జీరామ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి కేటీఆర్, పక్కన ఎమ్మెల్సీ ఎల్.రమణ తదితరులు

- పోలీసుల భారీ బందోబస్తు

జగిత్యాల: ఎమ్మెల్సీ ఎల్.రమణను రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పరామర్శించారు. రమణ తండ్రి ఎల్జీరామ్ ఇటీవల కన్నుమూసిన విషయం విదితమే. స్థానిక విరూపాక్షి గార్డెన్‌లో ఆదివారం ఎల్జీరామ్ సంస్మరణ సభ జరిగింది. మంత్రి కేటీఆర్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. రమణను పరామర్శించారు. ఎల్జీరామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మంత్రి వెంట ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, రవిశంకర్, మనోహర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వసంత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, నాయకులు తదితరులు ఉన్నారు.

భారీ పోలీసు భద్రత

జగిత్యాలక్రైం: హైదరాబాద్ నుంచి పెర్కిట్, మెట్‌పల్లి మీదుగా మంత్రి కేటీఆర్ రోడ్డు మార్గాన జగిత్యాల చేరుకున్నారు. ఆయన పర్యటనకు పోలీసులు భారీబందోబస్తు ఏర్పాటు చేశారు. మెట్‌పల్లి శివారులోని గండి హన్మాన్ టెంపుల్ నుంచి జగిత్యాల వరకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రధాన రహదారుల వెంట తనిఖీలు చేశారు. నలుగురు డీఎస్పీలు, పలువురు సీఐలు, ఎస్‌ఐలతో బందోబస్తు పర్యవేక్షించారు. స్థానిక విరూపాక్షి గార్డెన్ వద్ద బందోబస్తును ఎస్పీ భాస్కర్ పర్యవేక్షించారు.

కేటీఆర్‌కు ఘనస్వాగతం

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలో పర్యటించిన మంత్రి కేటీఆర్‌కు జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత దంపతులు పూలబొకే అందించి ఘనస్వాగతం పలికారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వసంతతో కేటీఆర్ కొంతసేపు ముచ్చటించారు. ఆమె వెంట జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.



బందోబస్తు పర్యవేక్షిస్తున్న ఎస్పీ భాస్కర్

ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలి

జగిత్యాలటౌన్: తమ ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని రెండో ఏఎన్ఎంలు మంత్రి కేటీఆర్‌ను కోరారు. తమపై అధిక పనిభారం ఉందన్నారు. మాతాశిశు సంరక్షణ సేవలు, గర్భిణుల వివరాల నమోదు మొదలు.. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యపరీక్షలు, ప్రసవాల వరకూ తమదే బాధ్యతని పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో గాండ్ల మధురిమ, పడాల మమత, గూడూరి జయప్రద, శోభ, మేరి, శైలజ, పద్మ, జయసుధ, జ్యోతి ఉన్నారు. కాగా, సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ, పేస్కేల్ అమలు చేయాలని సమగ్ర శిక్షా అభియాన్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షుడు బర్ల నారాయణ మంత్రిని కలిసి విన్నవించారు.

పాతపింఛన్ విధానం అమలు చేయాలి

జగిత్యాలటౌన్: డీఎస్సీ– 2003 ఉపాధ్యాయులకు పాత పింఛన్ అమలు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి మంత్రి కేటీఆర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట ప్రతినిధులు పింగళి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు, యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, ఆనందరావు, చిట్నేని విజయ్‌కుమార్, శ్రీధర్, విజయ్‌రావు, వేణు ఉన్నారు.

కోనసీమ హామీ ఏమైంది?

- కాంగ్రెస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్

కథలాపూర్(వేములవాడ): జిల్లాలో 2018లో జరిగిన ఎన్నికల ప్రచారం సందర్భంగా మేడిపెల్లి మండలాన్ని కోనసీమగా అభివృద్ధి చేస్తామని ప్రకటించిన మంత్రి కేటీఆర్ హామీ ఏమైందని రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. ఆదివారం బీమారం మండలం గోవిందారం గ్రామంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందస్తు అసెంబ్లీ ఎన్నికల వేళ మేడిపెల్లి మండలంలో పర్యటించిన మంత్రి కేటీఆర్.. ఆ తర్వాత ఇటువైపు కన్నెత్తి చూడలేదని విమర్శించారు. మేడిపెల్లి– గోవిందారం రోడ్డు పనుల విధివిధానాలు పూర్తయిన తర్వాత పనుల్లో ఎందుకు జాప్యం చేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మోత్కురావుపేట– చందుర్తి రోడ్డు పనులకు నిధులు మంజూరైతే ఏళ్లతరబడి ముందుకు సాగకపోవడం దారుణమని మండిపడ్డారు. వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ అనేది కాంగ్రెస్ పార్టీ హక్కు అని, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఆందోళనలు చేయడంలో అర్థంలేదని దుయ్యబట్టారు. రైతులకు పంట రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేసి బీఆర్‌ఎస్ ప్రభుత్వం తన చిత్తశుద్ధి చాటుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు లచ్చనాయక్, నీరటి మల్లేశం, తోకల నర్సయ్య, నారాయణ, గణేశ్, ప్రభు, లక్ష్మణ్, లింగం పాల్గొన్నారు.

అడవిలో మొక్కలు నాటడం ఏమిటి?

- సంతోష్‌కుమార్‌కు కాంగ్రెస్ నాయకుల సూటిప్రశ్న



మాట్లాడుతున్న నాయకులు

మల్యాల(చొప్పదండి): కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయ పరిసరాల్లోని అడవుల్లో ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ మొక్కలు నాటడం ఏమిటని కాంగ్రెస్ పార్టీ నాయకులు విస్మయం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు దొంగ ఆనందరెడ్డి తదితరులు మాట్లాడారు. చుట్టూ గుట్టలు, ఏపుగా పెరిగిన భారీచెట్లు ఉండగా.. ఎంపీ మొక్కలు నాటడం ఎందుకని నిలదీశారు. ప్రచార ఆర్భాటాల కోసమే సంతోష్‌కుమార్ అటవీ ప్రాంతాన్ని దత్తత తీసుకున్నారని విమర్శించారు. వందల ఎకరాల అటవీ భూములు అన్యాక్రాంతమవుతున్నా ఎవరూ పట్టింపుకోవడం లేదని ధ్వజమెత్తారు. పర్యావరణ పరిరక్షణకు నిజంగా కృషి చేయాలనే తపన ఉంటే అటవీ సంరక్షణ కోసం చర్యలు చేపట్టాలని ఎంపీకి సూచించారు. ఎంపీ సంతోష్‌కుమార్‌తోపాటు ప్రజాప్రతినిధులు అంజన్న ఆలయ గర్భగుడిలోకి దుస్తులతో వెళ్లి భక్తుల మనోభావాలు దెబ్బతీశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దారం ఆదిరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శనిగారపు తిరుపతి, నాయకులు రామగిరి మురళి, నలువాల సంజీవ్, పట్టణ అధ్యక్షుడు కటికం వినయ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సదల అంజయ్య, మ్యాక సాయి, శ్రీకాంత్, భాస్కర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టు రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

- ఎస్సారెస్పీలోకి చేరుతున్న నీరు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాకు సాగు, తాగునీరు అందించే శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరడంపై అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. మొన్నటివరకు ప్రాజెక్టులో అంతంతమాత్రమే ఉన్ననీటి నిల్వలు క్రమంగా పెరుగుతున్నాయి. ఒకవైపు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, మరోవైపు కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారా వచ్చే గోదావరి నీటితో ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఈ వానాకాలంలో ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. నీటిమట్టం గణనీయంగా పడిపోయింది. అయితే, ఎత్తిపోతలు, ఎగువన కురుస్తున్న వర్షాలతో కనీస్థాయిలో నీటినిల్వలు ఉంటే వారానికి ఒకసారైనా ఆయకట్టుకు సాగునీరు అందే వీలుందని రైతులు ఆశిస్తున్నారు.

జిల్లాలో 4.50 లక్షల ఎకరాల్లో సాగు..

- జిల్లాలో ఈ వానాకాలంలో దాదాపు 4.50 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని అధికారుల అంచనా.
- ఇందులో కేవలం వరి దాదాపు 3 లక్షల ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉంది.
- ఈ పంటకు సాగునీటి అవసరం ఎక్కువ.
- ప్రస్తుతం వ్యవసాయ బావుల్లోని నీటి ఆధారంగా నారు పెంచుతున్నారు.
- ఇంకా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకుంటే వ్యవసాయబావుల్లో ఉన్న నీరు పంటలకు సరిపోయేలా లేదు.
- అందుకే.. త్వరగా ఎస్సారెస్పీ నిండాలని, ప్రధాన వరి పొలం దున్నే సమయానికి సాగునీరు అందాలని రైతులు కోరుకుంటున్నారు.
- మిగతా లక్షన్నర ఎకరాల్లో సాగయ్యే మొక్కజొన్న, పసుపు వంటి పంటలకు డ్రిప్ ద్వారా సాగునీరు అందిస్తున్నారు.
- అయితే, ఆరుతడి పంటలకు అప్పుడప్పుడు సాగునీటితోపాటు వర్షం కురిస్తే సరిపోతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.
- ఎటొచ్చీ వరి పంటకే సాగు నీరు అధికంగా అందించాల్సిన పరిస్థితి ఉంది.

ప్రాజెక్టులో 27.738 టీఎంసీల నీళ్లు..

ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటిమట్టం 1,091.00 అడుగులు కాగా, ప్రస్తుతం 1,069.40 అడుగులు ఉంది. నీటినిల్వ సామర్థ్యం 90.3 టీఎంసీలకు ప్రస్తుతం 27.738 టీఎంసీలు ఉంది. ఈ సీజన్‌లో జూన్ 1 నుంచి 9.319 టీసీఎంల నీరు వచ్చిచేరింది. ఇందులో, కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారానే 2.117 టీఎంసీలను తరలించారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో 26,088 క్యూసెక్కులు, కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారా 4,350 క్యూసెక్కులు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

గతేడాదికన్నా తక్కువే..

- ఇదే సమయానికి గతేడాది ప్రాజెక్టు నీటిమట్టం 1,087.90 అడుగులు ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 76.105 టీఎంసీలు ఉంది.
- ప్రస్తుతం ప్రాజెక్టులోకి 30,438 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. 1,174 క్యూసెక్కుల అవుట్ ఫ్లో వెళ్తోంది.
- ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 360 క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270 క్యూసెక్కులు, మిషన్ భగీరథ కింద తాగు నీటి కోసం జగిత్యాలకు 41 క్యూసెక్కులు, ఆదిలాబాద్, నిర్మల్‌కు 42 క్యూసెక్కులు, ఆర్మూర్, నిజామాబాద్, కామారెడ్డికి 69 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.
- కరెంట్ ఉత్పత్తి కోసం కాకతీయ మెయిన్ కాల్వకు 50 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

గతంలో ఆందోళనలు..

గతంలో ఎస్సారెస్పీ నీటిని వానాకాలం పంటలకు ఇచ్చేవారు కాదు. కేవలం యాసంగి పంటలకే విడుదల చేసేవారు. దీంతో సాగునీరు విడుదల చేయాలని రైతులు ఆందోళనలు చేసేవారు. ఫలితంగా ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వలను బట్టి ఆయా సీజన్‌లకు ఆన్, ఆఫ్ పద్ధతిన నీరు వదిలేవారు. దీంతో, ప్రత్యక్షంగా 4–5 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుండగా, పరోక్షంగా మరో 4–5 లక్షల ఎకరాలకు లబ్ధి చేకూరేది. జిల్లాలో ఒకటి, రెండు మండలాలు మినహా మిగతా మండలాలు ఆయకట్టు పరిధిలో ఉండటం, కథలాపూర్, మేడిపల్లి, కొడిమ్యాల వంటి మండలాలకు వరదకాల్వ ద్వారా సాగునీరు అందించే ఏర్పాట్లు చేస్తుండటంతో జిల్లా రైతులకు ఎస్సారెస్పీ వరప్రదాయనిగా మారింది. అయితే, ప్రాజెక్టు నీటి మట్టం మధ్యస్థంగా కనీసం 35–45 టీఎంసీలకు చేరితే, సాగునీరు విడుదల చేసే అవకాశం ఉంది. బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తినప్పటికీ.. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ప్రాజెక్టులోకి పెద్దగా వరదనీరు రావడం లేదు.

ప్రాజెక్టు నిండాలి



ఎస్సారెస్పీ జిల్లాకు వరప్రదాయని. ప్రాజెక్టు నిజామాబాద్ జిల్లాలో ఉన్నా.. మన జిల్లాకే ఎక్కువనీరు అందిస్తుంది. ప్రాజెక్టు నుంచి నీరు రాకపోతే పంటలు పండటం కష్టం. చాలామంది వరి నార్లు పోయాలా.. వద్దా? అని ఆలోచిస్తున్నారు. ప్రాజెక్టు త్వరగా నిండాలని కోరుకుంటున్నా.

– మామిడి మహేందర్, రైతు, తొంబర్రావుపేట, మేడిపల్లి

సాగు విస్తీర్ణం పెరుగుతుంది



ఎస్సారెస్పీ నీటితో జిల్లాలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. రెండు సీజన్లలో సాగువిస్తీర్ణం దాదాపు 7లక్షల నుంచి 8 లక్షల ఎకరాలకు చేరే అవకాశం ఉంది. అయితే, ఈఏడాది ప్రాజెక్టులోకి ఇప్పుడిప్పుడే నీరు వచ్చి చేరుతోంది. ఈ నీటిపైనే రైతులు ఆశలు పెంచుకున్నారు.

– సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

నీరు ఇప్పుడే వస్తోంది



ప్రాజెక్టులోకి ఇప్పుడిప్పుడే నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు ఎగువన భారీ వర్షాలు కురవడంలేదు. చిరుజల్లులు కురుస్తున్నాయి. ఎలాగైనా వానాకాలం పంటలకు సాగు నీరు అందించాలనే లక్ష్యంతో కాళేశ్వరం నుంచి ఎత్తిపోతల ద్వారా నీటిని తరలిస్తున్నాం.

– రమేశ్, డిప్యూటీ సీఈ, ఇరిగేషన్, జగిత్యాల

క్లుప్తంగా

విలువ ఆధారిత ఉత్పత్తులపై దృష్టి సారించాలి

- కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ వెంకటేశ్వర్‌రావు



కూరగాయల సాగుపై మహిళలకు వివరిస్తున్న శాస్త్రవేత్త ప్రశాంతి

జమ్మికుంట(హుజూరాబాద్): గ్రామీణ రైతులకు నూతన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తూ రైతుల ఆదాయం పెంచే దిశగా కేవీకే పని చేస్తుందని సీనియర్ శాస్త్రవేత్త, కేవీకే హెడ్ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఐసీఏఆర్ 95వ వ్యవస్థాపక, సాంకేతిక దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలోని జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) అనుబంధ సంస్థ కేవీకే ద్వారా మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, దిగుబడులు పెంపొందించేందుకు కృషి చేస్తుందని పేర్కొన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల కలిగే దుష్ఫలితాలను వివరిస్తూ, పర్యావరణ పరిరక్షణకు సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై దృష్టి సారించేలా రైతులకు సూచనలు అందిస్తుందన్నారు. విలువ ఆధారిత ఉత్పత్తులపై రైతులు దృష్టి సారించాలని పేర్కొన్నారు. రైతులకు సూచనలు, సలహాలతో కేవీకే అందుబాటులో ఉంటుందని వివరివంచారు. ఈ కార్యక్రమం మూడు రోజుల పాటు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రిటైర్డ్ ఏడీఏ రామచందర్‌రావు, శాస్త్రవేత్తలు ప్రశాంతి, మహేష్, విజయ్, ల్యాబ్ అసిస్టెంట్ సుప్రజ, ఫామ్ మేనేజర్ సింగ్, సిబ్బంది, రైతులు, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ మహిళలు పాల్గొన్నారు.

యువతి మృతిపై ఫిర్యాదు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో యువతి మృతిచెందగా తండ్రి కరీంనగర్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితులు తెలిపిన వివరాలు.. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం శ్రీరాములపల్లెకు చెందిన బండపెల్లి రాజయ్య కూతురు చైతన్య (23) నాలుగేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎడమ కాలు విరగడంతో నగునూరులోని ఓ ఆస్పత్రిలో ఆపరేషన్ చేసి రాడ్ అమర్చారు. ఈనేపథ్యంలో కాలుకు అమర్చిన రాడ్‌ను తొలగించుకునేందుకు ఈ నెల 11న ఆస్పత్రిలో చేరిన చైతన్యకు వైద్యులు ఆపరేషన్ చేశారు. అయితే శనివారం ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆందోళనకు గురైన తండ్రి రాజయ్య వైద్యులను కలిస్తే డబ్బు డిపాజిట్ చేయాలని చెప్పారు. అదేరోజు రాత్రి 12.40గంటలకు పరిస్థితి విషమించి చైతన్య మృతిచెందగా ఆస్పత్రి యాజమాన్యం పట్టించుకోలేదు. తన కూతురు మృతికి కారణమైన వైద్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని రాజయ్య ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నాట్లు వేస్తూ.. కలుపు తీస్తూ..

- వరి నాట్లలో పొరుగు రాష్ట్రాల కూలీలు
- గ్రామాల్లోనే వంట చేసుకుంటూ.. పనుల్లో నిమగ్నం
- నారు పీకి, నాటు వేస్తే ఎకరాకు కూలి రూ.4,500



బొమ్మెనలో నాట్లు వేస్తున్న ఉత్తరప్రదేశ్ కూలీలు

జగిత్యాలఅగ్రికల్చర్: గ్రామాల్లో వ్యవసాయ పనులకు కూలీల కొరత ఎదరైంది. ఉన్న ఒకరిద్దరు కూడా ఉపాధిహామీ పనులకు వెళ్తుండడంతో వరి నాట్లు, కలుపు తీత వంటి పనులకూ కష్టతరంగా మారింది. ప్రస్తుతం ఇతర రాష్ట్రాల కూలీలు వస్తేనే, వ్యవసాయ పనులు సాగే పరిస్థితి దాపురించింది. ఇప్పటివరకు, ధాన్యం తూకం వేసేందుకు మహారాష్ట్ర, బిహార్ నుంచి కూలీలు రాగా, ప్రస్తుతం వరి నాట్ల కోసం ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్ నుంచి కూలీలను రప్పించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

స్థానికులు పనులకు దూరం..

- గతంలో వ్యవసాయ పనులు చేసినవారు వృద్ధులు కావడంతో వారికి ఆరోగ్యం సహకరించడంలేదు.
- దీంతోపాటు, భర్త, పిల్లలు విదేశాలకు వెళ్తుండడంతో కుటుంబాలు ఆర్థికంగా ఎదిగాయి.
- ప్రభుత్వం నుంచి పింఛన్ అందుతోంది. ఇతర సంక్షేమ పథకాలు వర్తిస్తున్నాయి.
- దీంతో కూలికి వెళ్లి పెద్దగా సంపాదించాలనే ఆశలు స్థానికుల్లో లేకుండా పోయాయి.
- ఎండలు, వర్షం అంటూ చాలామంది మహిళలు ఇళ్లలోనే బీడీలు తయారు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు.
- జిల్లాలోని యువత కూడా ఎంతోకొంత చదువుకుంటూ, చిన్నపాటి ఉద్యోగం చూసుకుంటోంది.
- ంతో వ్యవసాయ పనులకు కూలీల కొరత ఏర్పడింది.
- గతంలో నాలుగైదు కుటుంబాలు కలిసి వ్యవసాయ పనులు చేసుకునేవి.
- ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. కూలి ఎంతైనా వెచ్చించి కూలీలతో పనులు చేయించుకుంటున్నారు.
- అందరూ కూలీల శ్రమపైనే ఆధారపడుతున్నారు.
- దీంతో గ్రామాల్లో కూలీల కొరత ఏర్పడింది.
- స్థానిక మహిళా కూలీలకు రోజూ రూ.500, మగవారికి రూ.1,000 వరకు కూలి ఉంది.

ఆదుకుంటున్న ఉత్తరప్రదేశ్, బిహార్ కూలీలు..

ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో పేద తరగతి ప్రజానీకం ఎక్కువ. వీరికి వ్యవసాయ భూములు కూడా అంతంతే. దీనికితోడు, ఆయా రాష్ట్రాల్లో వర్షాల ఆధారంగానే గోధుమ, సజ్జ వంటి పంటల పండిస్తారు. వాటిద్వారా వచ్చే ఆదాయం ఆ రైతు కుటుంబాలకు సరిపోవడం లేదు. దీంతో, అక్కడి వారు ఉపాధి వెతుక్కుంటూ వలస వస్తున్నారు. జిల్లాలో వరిని వానాకాలం, యాసంగిలో పండిస్తున్నారు. ఈ పంట ఆ రాష్ట్రాల కూలీలకు కలిసి వస్తోంది. దళారుల ద్వారా గ్రామాలకు చేరుకుని వరి నాట్లు వేస్తున్నారు. ఒక్కో గ్రామానికి దాదాపు 15 మంది వరకు కూలీలువచ్చారు. వీరు ఎకరాకి రూ.4,500 వరకు కూలి తీసుకుంటారు. ఉదయం 7 గంటలకే పొలానికి చేరుకుని సాయంత్రం 4 గంటల వరకు పనులు చేస్తున్నారు. ఐదారుగురు కూలీలే ఎకరంలోని వరి నారు పీకి, నాటు వేస్తున్నారు. స్థానిక కూలీల కన్నా మెరుగ్గా నాటు వేయడంతో మొక్కల వేర్లకు సరిపడా ఆక్సిజన్ లభించి, ఎండ తగిలి, పురుగులు, తెగుళ్ల ఆశించడం లేదని, దిగుబడి కూడా బాగా వస్తోందని పలువురు రైతులు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలోని కథలాపూర్, మెట్‌పల్లి, కోరుట్ల, మేడిపల్లి మండలాల్లో ఇతర రాష్ట్రాల కూలీలు వచ్చి నాట్లు వేస్తున్నారు. వీరు ఇక్కడ దాదాపు నెల రోజుల పాటు ఉంటారు. ఒక్కొక్కరు ఈ సీజన్‌లో సుమారు రూ.25వేల నుంచి రూ.30 వేల వరకు సంపాదించుకుని వెళ్తారు.

మేం కూడా నాట్లు వేస్తాం



మా కుటుంబాలతో కలిసి ఉత్తరప్రదేశ్ నుంచి ఇక్కడకు వచ్చాం. మేమే నారు పీకి నాటు వేస్తాం. ఇక్కడ నాటు వేసే సమయంలో మా దగ్గర పనులు ఉండవు. అందుకే ఎంతోకొంత ఉపాధి దొరకుతుందని, రెండు సీజన్లలో ఇక్కడికి వస్తాం.

– కిశోర్ బిషు, కూలీ, ఉత్తరప్రదేశ్

మాకు వరి తక్కువ



మా ప్రాంతంలో సమృద్ధిగా నీరు లేదు. వర్షాధారంగా పంటలు పండుతాయి. దీంతో, పంట ఇంటికి వస్తుందన్న గ్యారెంటీ లేదు. మాకు భూములు కూడా ఎక్కువగా లేవు. దీంతో, వరి నాటు వేసే సమయంలో ఇక్కడకు వచ్చి ఉపాధి పొందుతాం.

– మృణాల్ మండ, కూలీ, ఉత్తరప్రదేశ్

స్థానికేతరులతోనే పనులు



గ్రామాల్లో ఇంటింటికీ నాలుగైదుసార్లు తిరిగినప్పటికీ ఒక్క కూలీ కూడా రావడం లేదు. జిల్లాలో వరి నాట్లు వేసేందుకు ఇతర రాష్ట్రాల కూలీలు రావడంతో నాట్లు వేస్తున్నాం. ఇతర రాష్ట్రాల కూలీలు ఉదయం 7 గంటలకే పొలానికి వెళ్లి నాటు వేస్తున్నారు.

– కొమ్ముల రాజేందర్‌రెడ్డి, రైతు, బొమ్మెన, కథలాపూర్

వ్యాన్ పట్టివేత



గుంతలో దిగబడిన వ్యాన్

జగిత్యాలక్రైం: కరీంనగర్ రోడ్డులో రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యాన్ ప్రమాదవశాత్తు బురదలో దిగబడింది. దీంఅసలు విషయం బయట పడింది. బుగ్గారం మండలం చిన్నాపూర్ సమీపంలోని ఓ రైస్‌మిల్లు నుంచి కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పర్లపల్లికి ఐచర్ వ్యాన్‌లో 183 క్వింటాళ్ల నూకలు తరలిస్తున్నారు. వ్యాన్‌డ్రైవర్ వద్ద ఉన్న రసీదులో మాత్రం హైదరాబాద్‌కు చెందిన శ్రీమహాలక్ష్మి ట్రేడర్స్ వేబిల్లు ఉంది. బిల్లు పొంతన లేకుండా ఉండటంతో అధికారులు రేషన్ బియ్యంగా అనుమానిస్తున్నారు. బురదలో చిక్కుకున్న వ్యాన్‌ను పట్టణ ఎస్‌ఐ సంజీవ్ క్రేన్ సాయంతో బయటకు తీయించారు. పట్టణ పోలీసుస్టేషన్‌కు తరలించారు. వ్యాన్‌లో తరలిస్తున్నవి రేషన్ బియ్యమా..నూకలా అనేవి తేల్చేందుకు పౌరసరఫరాల శాఖ అధికారికి లేఖ పంపారు. దీంతో వారు పరీక్షిస్తే తప్ప నూకలా..బియ్యమా అనేది తేలనుంది.

ఆగిన పసి హృదయం

వీర్నపల్లి(సిరిసిల్ల): కొడుకును కాపాడుకునేందుకు ఆ తల్లిదండ్రులు చేసిన ప్రయత్నాలు ఫలించలేవు. గుండెలో రంధ్రంతో ఏడాది వయస్సు గల కొడుకు చనిపోవడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. మండలంలోని బంజేరు గ్రామానికి కన్నం బాబు–మమత దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు, ఏడాది వయస్సు ఉన్న సిద్ధు సంతానం. సిద్ధు గుండెలో చిన్నరంధ్రం ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. చికిత్స కోసం కరీంనగర్, హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రుల్లో చూపించారు. పేదకుటుంబమైనా రూ.3లక్షలు అప్పు చేసి చికిత్స చేయించారు. ఆపరేషన్‌కు మరో రూ.6లక్షలు ఖర్చు అవుతుందని చెప్పడంతో మళ్లీ అప్పు సమకూర్చుకునేందుకు ఇంటికొచ్చారు. శనివారం రాత్రి ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది పడుతుండడం గమనించి ఆస్పత్రికి తీసుకెళ్తుండగా బాలుడు ప్రాణాలు కోల్పోయాడు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- తులం బంగారం రూ.7వేల నగదు అపహరణ



దొంగలు పగులగొట్టిన బీరువా

ధర్మపురి: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. తులం బంగారంతోపాటు వెండి, రూ.7వేల నగదు అపహరణకు గురైంది. పట్టణంలోని కాశెట్టివాడలో ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ధర్మపురికి చెందిన శీలం రాజు కొన్నినెలల క్రితం మృతి చెందాడు. అతడి భార్య పద్మ తన ఇద్దరు కుమారులతో కలిసి ఉంటోంది. పెద్ద కుమారుడు కరీంనగర్‌లో చదువుతున్నాడు. అయితే, వారంరోజుల క్రితం ఇంటికి తాళం వేసి తన చిన్న కొడుకుతో కలిసి స్థానికంగా ఉన్న తన పుట్టింటికి వెళ్లింది. ఆదివారం ఉదయం ఇంటితాళం పగులగొట్టి.. తలుపులు తీసి ఉండడాన్ని చూసిన స్థానికులు.. పద్మకు సమాచారం అందించారు. ఇంటికి వచ్చిన ఆమె.. లోపలికి వెళ్లి చూడగా.. బీరువాలోని వస్తువులు, బట్టలు చిందరవందరగా పడిఉన్నాయి. అందులో దాచి ఉంచిన తులం బంగారం, వెండి వస్తువులు, రూ.7వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించింది. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు ఎస్సై దత్తాత్రి తెలిపారు. సంఘటనా స్థలానికి క్లూస్ టీమ్ చేరుకుని వేలిముద్రలు సేకరించింది. జాగిలాలు చోరీ జరిగిన ఇంటి నుంచి జాతీయ రహదారి వరకు వెళ్లి ఆగిపోయాయి.

వివాదాలు.. సెటిల్‌మెంట్లు

➡ జిల్లా కేంద్రంలోని గొల్లపల్లి రోడ్డులో ఓ సామాన్యుడు ఇటీవల భూమి కొనుగోలు చేసుకుని రిజిస్ట్రేషన్ చేయించాడు. దాని పక్కనే ఓ రిటైర్డ్ ఉద్యోగి తన కుమార్తె పేరున వ్యవసాయ భూమి కొనుగోలు చేశారు. కొద్దిరోజుల తర్వాత ఆ సామాన్య వ్యక్తి ఆ భూమి తనదేనని రాజకీయంగా ఒత్తిళ్లు తెచ్చాడు. రిటైర్డ్ ఉద్యోగిపై కేసు నమోదు చేయించాడు.

➡ కోరుట్ల పట్టణ శివారులోని ఓ వ్యాపారవేత్తకు, ఓ రిటైర్డ్ ఉద్యోగి మధ్య కొద్దికాలంగా భూ వివాదం కొనసాగుతోంది. దీంతో వ్యాపారి నిబంధనల ప్రకారం సర్వే చేయించి భూమికి హద్దులు ఏర్పాటు చేయించుకున్నాడు. ఓ రౌడీ రంగంలోకి దిగి ఆ హద్దులను తొలగించాడు. ఆ ఇద్దరి మధ్య తానే మధ్యవర్తిత్వం నెరిపి సమస్యను సెటిల్ చేశాడు. ఇందుకోసం రూ.లక్షలు వసూలు చేశాడు.

- చేతులు మారుతున్న రూ.కోట్లు



జగిత్యాలక్రైం: జిల్లాలో భూముల ధరలు భారీగా పెరుగుతున్నాయి. దీంతో కొన్నిచోట్ల ఇవి వివాదాలకు కారణమవుతున్నాయి. విలువైన భూములపై రాజకీయ నాయకులు, కొందరు రౌడీలు కన్నేస్తున్నారు. క్రయ, విక్రయదారుల మధ్య వివాదాలు సృష్టిస్తున్నారు. చివరకు ఇద్దరి మధ్య వారే మధ్యవర్తులుగా మారి సమస్య సెటిల్ చేస్తున్నారు. ఇందుకోసం రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కొందరు నాయకులతో కలిసి దందా సాగిస్తున్నారు. రెండు వర్గాలను సమన్వయం చేయడం, అలా కుదరకపోతే ఒక వర్గానికి కొమ్ముకాస్తూ సెటిల్‌మెంట్లు చేస్తున్నారు.

పోలీసులపై ఒత్తిడి

- జిల్లావ్యాప్తంగా భూ సెటిల్‌మెంట్ల సమస్య తలెత్తినప్పుడు బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే నాయకులు, దళారుల గ్యాంగ్ కేసులు నమోదు కాకుండా పోలీసులపై తీవ్ర రాజకీయ ఒత్తిళ్లు తెస్తోంది.
- న్యాయం జరుగకపోవడంతో బాధితులు నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి సెటిల్‌మెంట్లకు అంగీకరిస్తున్నారు.
- చేసేదేమీలేక ఇచ్చింది తీసుకుని వివాదాల్లోంచి పక్కకు తప్పుకుంటున్నారు.

చేతులు మారుతున్న రూ.కోట్లు..

జిల్లాలో చాలామంది భూ బాధితులు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు నానాతిప్పలు పడుతున్నారు. రాజకీయ అండదండలు లేకపోవడం, అధికారులు సహకరించకపోవడంతోపాటు, దళారుల బెదిరింపులు భరించలేక రూ.కోట్ల విలువైన భూములను అడిగిన ధరకు విక్రయిస్తున్నారు. సెటిల్‌మెంట్లు చేసే నాయకులు, దళారుల గ్యాంగ్ కొద్దికాలంలోనే తిరిగి ఆ భూములను విక్రయించి రూ.కోట్లు ఆర్జిస్తున్నారు.

చర్యలు తప్పవు

భూ సెటిల్‌మెంట్లలో తలదూర్చి, ఎవరిని భయభ్రాంతులకు గురిచేసినా, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డా కఠిన చర్యలు తీసుకుంటాం. బాధితులు ఫిర్యాదు చేసినా విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు చేపడతాం.

– భాస్కర్, ఎస్పీ

రోడ్డు ప్రమాద బాధితులకు ప్రథమ చికిత్స



ప్రథమ చికిత్స చేస్తున్న డాక్టర్ సంజయ్

కోరుట్ల: రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ జగిత్యాలలో ఆదివారం ఎమ్మెల్సీ రమణ తండ్రి దశదిన కర్మకు హాజరయ్యారు. హైదరాబాద్ తిరిగి వెళ్తుండగా మెదక్ జిల్లా చేగుంట వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. కేటీఆర్ వాహనం ఆపి రోడ్డు ప్రమాద బాధితులను దగ్గరుండి తన వాహనంలో హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. కేటీఆర్ వెంట ఉన్న కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు తనయుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ గాయపడ్డవారికి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం కేటీఆర్ తన వాహనంలోనే బాధితులను హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

బైక్ అదుపుతప్పి యువకుడి దుర్మరణం



సాయిరాం (ఫైల్)

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చామనపల్లికి చెందిన మునిగంటి సాయిరాం(22) ఆదివారం రాత్రి బైక్‌పై వెళ్తూ చెట్టును ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. మునిగంటి మంగ– ఎల్లయ్య దంపతులకు సాయిరాం ఒక్కడే కుమారుడు. తీగలగుట్టపల్లిలోని వైన్స్‌లో పనిచేస్తున్న సాయిరాం ఆదివారం రాత్రి 9గంటలకు ద్విచక్రవాహనంపై చామనపల్లి నుంచి నగునూరుకు వెళ్తుండగా మార్గమధ్యలో జూబ్లీనగర్ శివారులో వాహనం అదుపు తప్పడంతో చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సాయిరాం తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కాగా సాయిరాం ఈ రోజు సాయంత్రమే కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో స్నేహితులతో కలిసి యూట్యూబ్ రీల్స్ చేశాడు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు..



ఘటన స్థలంలో హన్మండ్లు మృతదేహం

కొత్తపల్లి(కరీంనగర్): గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందిన ఘటన ఆదివారం మల్కాపూర్‌లో జరిగింది. పోలీసులు, మృతుడి భార్య శంకరవ్వ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన ఇల్లందుల హన్మండ్లు(75) ఆదివారం ఉదయం మోటార్ సైకిల్‌పై బతికినపెల్లిలో ఉన్న కూతురు ఇంటికి వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో మల్కాపూర్ గ్రామ శివారు డంపింగ్ యార్డు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈప్రమాదంలో హన్మండ్లు కుడికాలు, తలకు దెబ్బతగిలి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి



మోహన్(ఫైల్)

కరీంనగర్‌క్రైం/జూలపల్లి: కరీంనగర్ అంబేద్కర్‌నగర్‌లో నూతన ఆసుపత్రి భవన నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు భవనం పైనుంచి కింద పడి వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జూలపల్లి మండల కేంద్రానికి చెందిన తోట మోహన్ (48) కరీంనగర్‌లో భవన నిర్మాణ కూలీగా పనులు చేస్తున్నాడు. అంబేద్కర్‌నగర్‌లో ఆదివారం ఉదయం ఆసుపత్రి నిర్మాణ పనులు చేస్తున్న క్రమంలో భవనం ఐదవ అంతస్తుకు మెటీరియల్‌ను కింది నుంచి క్రేన్ ద్వారా పైకి తీసుకుంటుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడిపోయాడు. కాళ్లు, తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా సీఐ శ్రీనివాస్ ఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించి మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా ఆస్పత్రి వద్దకు కార్మికులు తరలివచ్చారు. ఈ ఘటనలో మరో ఇద్దరు కార్మికులు జోహార, మహేంద్రకు కూడా గాయాలు అయ్యాయి. మృతుడి భార్య అంజలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోజువారీ కూలీ..

జూలపల్లి మండల కేంద్రానికి చెందిన తోట మోహన్‌ది నిరుపేద కుటుంబం. రోజువారీ కూలీ పనులకు కరీంనగర్‌కు వెళ్లేవాడు. ఆదివారం ప్రమాదవశాత్తు మృతిచెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. మృతుడికి భార్య అంజలి, కుమారుడు రవి, కూతురు సన్నిహిత ఉన్నారు. కూతురుకు పెళ్లి కాగా, కుమారుడు జూలపల్లిలోని కిరాణ దుకాణంలో పనిచేస్తున్నాడు. బాధిత కుటుంబాన్ని భవనం నిర్మాణ యజమాని ఆదుకోవాలని బంధువులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోరుట్ల: పట్టణంలోని అష్టలక్ష్మీ దేవాలయానికి వెళ్లే రోడ్డులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కథలాపూర్ మండలం తాండ్ర్యాల గ్రామానికి చెందిన చిన్నవేణి గణేశ్, కోరుట్ల పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన దేవరాయుల రాజుకు చెందిన ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో చిన్నవేణి గణేశ్ కాలుబొటన వేలు పూర్తిగా తెగిపోయింది. దేవరాయుల రాజు తలకు గాయాలయ్యాయి ఇద్దరిని ఆసుపత్రికి తరలించారు. చిన్నవేణి గణేశ్ పట్టణంలోని నలందా హైస్కూల్ హాస్టల్‌లో ఉంటూ పదో తరగతి చదువుకుంటున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పురస్కారం అందజేత

జగిత్యాలరూరల్: నిర్మాణ రంగంలో అత్యుత్తమ సేవలు అందించిన ఎస్ఆర్ హౌసింగ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ శనివారం ఢిల్లీలో ఐకాన్ –2023 అవార్డు అందుకుంది. ఎస్ఆర్ కంపెనీ జగిత్యాల, కరీంనగర్, హైదరాబాద్ నగరాల్లో నిర్మాణ రంగంలో విశేష సేవలు అందిస్తోంది. వీటిని గుర్తించిన గ్లోబల్ చాంబర్ ఆఫ్ కన్స్యూమర్ రైట్స్ న్యూఢిల్లీ.. పాండిచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడి చేతుల మీదుగా కంపెనీ నిర్వాహకుడు మల్లారెడ్డికి అవార్డు అందజేశారు.

'రివర్స్ మార్టిగేజ్' సీనియర్ సిటిజన్లకు వరం



మాట్లాడుతున్న హరిఅశోక్ కుమార్

కోరుట్ల: సీనియర్ సిటిజన్ల పోషణ, ఆర్థిక అవసరాల కోసం రివర్స్ మార్టిగేజ్ కార్యక్రమం ఒక వరం లాంటిదని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ అన్నారు. పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ సంఘ కార్యాలయంలో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వయోవృద్ధుల పోషణ, రక్షణ, సంక్షేమ చట్టం– 2007 నియమావళి – 2011 మేరకు తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లలపై ఆర్డీవోకు ఫిర్యాదు చేసే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల డివిజన్ అధ్యక్షుడు పబ్బా శివానందం, కార్యదర్శి గంటెడి రాజ్‌మోహన్, ఉపాధ్యక్షుడు ఎండీ సైఫొద్దీన్, కోశాధికారి నల్ల లక్ష్మీనారాయణ, మెట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఒజ్జెల బుచ్చిరెడ్డి, కార్యదర్శి సొదాల కమలాకర్, మేడిపెల్లి, కథలాపూర్ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.